# పుష్పమొకటి రాలిపోయినది

ఔరా!...అవని ప్రాంగణములో పుష్పించిన పుష్పమొకటి రాలిపోయినది. ఆకశంబు శిఖర రూపంబు దాల్చి చీకట్లు క్రమ్మినది పంచభూతములే ఏకమై నిస్సహాయ స్థితిలో ఘోషించ సాగినవి. మహా మనిషి మరణ వార్త. ఎంత ఘోరమైన అశుభ వార్త. ఏమిటో అశుభ సందేశం. అది అగమ్యగోచరమైన శోకమయ దినము, భరత జాతికే తీరని లోటు చేకూర్చిన మాయ దినము ఓ మహనీయుడు జననమొందిన గడ్డలోనే మరణమొందిన గడ్డు దినము. ఆ శాంతమూర్తి మరణించినా అతని దేదీప్య దివ్యకళలు మానవ ప్రపంచాన్ని ప్రేమించుచున్నవి. ఎవరా త్యాగశాలి? అతడే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు. భారత అధ్యక్ష పదవి పీఠమలంకరించి ఆ అధ్యక్ష ముద్రకు న్యాయం చేకూర్చిన నిజమైన దేశ భక్తుడు. జగమెరిగిన బ్రాహ్మణుండు, ఆంధ్ర మాతకు అనుంగు బిడ్డడు. భారత మాతకు ముద్దుల మనుమడు. ప్రపంచ తల్లి చిత్తమునకు నచ్చిన సిసలైన ఉత్తమ పుత్రుడు. తెలుగు జాతికే గర్వకారకుడు. భారత చరితకు వెలలేని రత్నం. ఆ తత్వశాస్త్ర కళా సామ్రాట్ అస్తమయం అవనికంతా అయోమయమైనది. తత్వశాస్త్ర కళలను పలుతీరుల పలికించిన పరమ పూజ్యుడతడు.

ఇరువది ఒక్క ప్రాయములోనే తత్వశాస్త్ర అధ్యాపక పీఠము నలంకరించిన మహా మేధా సంపన్నుడు. సున్నిత తలపాగ సుందరముగ ధరించి చూపరులకు నిరాంతంబుగాక, విజ్ఞాన రంగమున సవాలుగొట్టు సరస్వతీ పుత్రుడతడు. గంభీరోపన్యాసములో గగన సీమలయందు విహరించు చిత్ర-విచిత్ర జీవరాసులను సహితం తన తత్వశాస్త్ర భోదామృతముచే ఆకర్షింప చేసిన అఖండ ప్రతిభాశాలి. ఉద్దండులైన పండితులు నెందరో ఓడించిన ఉత్తమ సద్గుణశాలి. ఎన్నెన్నో బిరుదములు పైన వేసుకున్ననుగాని నీతివిడువని శీలియైన భారత రత్న యతడు. పూజ్య బాపూజీకి అనుంగు మిత్రుడు. దక్షిణమున జనించి ఆ గడ్డను పునీతము చేసిన పూజ్యనీయుడతడు, జనుల హృదిలో ప్రత్యేక పీఠము నలంకరించిన జగదేక వీరుడతడు. భారతీయ ప్రతిభకు ప్రతిరూపమతడు. విదేశ విద్యాలయందు కోకొల్లలైన బిరుదముల నందిన బహుకృతి గ్రహీత. ఆంధ్ర విశ్వవిద్యాలయం మొదలు ఆక్స్‌ఫర్డ్ కళాశాలల వరకు అతని సుమధుర నామధేయమును స్మరించని వారుండరు. అతని మేధాశక్తిని పదే పదే కొనియాడువారు కోటానుకోట్లు. తత్వశాస్త్రమే అతడు. ఆ సుందర విగ్రహ రూపుడే. నిఘంటువులో తత్వశాస్త్రమునకు మారు నామధేయము. పర్యాయ పదమే ఆ భరత బంగరు కొలను.

రాజకీయ చరిత్రమును సంపూర్ణముగ చవిచూసిననూ-ఆ చరిత్రకు తలవొగ్గని ఏకైక భారత ప్రతినిధిగా రష్యాకు రాయబారియై, అలనాడు పాండవులకు, కౌరవులకు సంధి నెరపిన పరంధామునినే మించిన నిగర్వి నిజమైన భరత పుత్రుడు.

కాని తుట్టతుదకు భారతమాత ఆశ నిరాశ అయినది. ఆ భగ్న హృదయురాలు హృదయమును ఓదార్చు దాత లెవ్వరూ కానరారు కదా.

రచన: కంచర్ల ఆదినారాయణ("కవిశ్రీ"